నీకు నీవే - నాకు నేనే

"ఏమయ్యో జగన్నాథం! నిన్నేనయ్యా! ఇట్లా చూడు. ఇదో యిక్కడ...."

బాగా పరిచయమున్న గొంతే! తటాలున చూచాను. పిలుస్తూ... ఆ వ్యక్తి అటువైపు పేవ్‌మెంటు మీది నుంచే రోడ్డుపైకి వచ్చేశాడు.

"నీకు పుణ్యముంటుంది గానీ తప్పుకోవయ్యా బాబూ! తప్పుకో, తప్పుకో" అంటూ గొంతు చించుకున్నాను.

వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పింది. అతడి శరీరాన్ని ఒరసుకున్నట్టుగా లారీ వెళ్ళిపోయింది.

"ఎంతసేపయ్యా నిన్ను పిలిచేది! ఇనిపించుకోవే! అన్నట్టెప్పుడొచ్చావూర్నించి?"

మళ్లీ గుండె గుభేలుమంది. ఈసారి కారు!

"ఓరి నీఇల్లు బంగారంగానూ! కారొస్తోందయ్యా బాబూ! ఆగు. అక్కడే ఆగిపో!" అంటూ దవడలు నొప్పి పుట్టేటట్టు మళ్ళీ బిగ్గరగా అరిచాను.

కారు దూసుకుంటూ జారిపోయింది. తన అవయవాలన్నింటితోనూ అతడు సురక్షితంగా మిగిలివున్నాడంటే, అందుకు కారణం కారు డ్రయివరు తీసుకున్న జాగ్రత్త అయినా కావాలి. లేకుంటే, భూమిపైన అతడి కింకా నూకలు మిగిలి వుండడమైనా అయివుండాలి.

చిన్న కుర్రాడైతే అందుబాటులోకి రాగానే సాచి నాలుగు లెంపకాయలిచ్చుకోవలసిన పని!

"మంచివాడివిలే రంగప్పా! రోడ్డు క్రాసు చేసేటప్పుడు అటూ ఇటూ చూచునోనక్కర్లేదా? ఇది టౌన్లో రోడ్డయ్యా బాబూ! మీ మద్దిమాకుల పల్లెలో బండిబాటకాదు" అని హెచ్చరించాను.

"అద్సరేనయ్యా! అయితే మాత్రం? లేక లేక మన పక్కోడు ఒకడు కనిపిస్తే ప్రానాలు లేచొచ్చినట్టుండదా? నీకు తెలుసునో, తెలియదో! నేనిప్పుడుండడం యిక్కడ్నే!"

"ఏం మాటలే రంగప్పా! కూతుర్ని చూడాలనిపించి యిలా వచ్చి వుంటావు. ఉంటే గింటే వారం పది రోజులుంటావు. ఆ మాత్రానికి పట్నంలో శాశ్వత పౌరసత్వం పుచ్చుకున్నట్టు మాట్లాడితే ఎలా? నీ ధోరణి నాకేమీ బాగుండలేదు" అన్నాను.

'ఓశ్ ఇంతేనా నీ తెలివి!' అన్నట్టు రంగప్ప పకాలున నవ్వేశాడు. "అదేంలేదులే జగన్నాథం! మద్దిమాకుల పల్లెలో ఏముందయ్యా? బతికినంతకాలం ఆ గుడ్డి కొంపలో బతికినాను. ఇప్పుడింక దానికి నాకూ రుణం తీరిపోయిందనుకో! రాజనాల భోజనం దొరికినాక రాగిపిండి సంగటి కోసరం పాలుమారే వాడెవడుంటాడు? అయినా నువ్వు చూళ్లేదులే! చూస్తే తెలుస్తుంది! రెండంతస్తుల మహిడీ, బాడిగిల్లేం కాదులే, సొంతమే! రూము రూముకు ఫాను. ఎక్కడ కావలిస్తే అక్కడ కొళాయి. కూచోవాలంటే సోపాల పడుకోవాలంటే నవారు మంచాలు. అవి గోడలు కావనుకో, అద్దాలు. అది నేల కాదే. పాలరాయి. వంటపనికి ఆడమనిషి, బజారు పన్లకు బంట్రోతు. అంతెందుకు. పాళేగాళ్ల దేవిడి అనుకోరాదా జగన్నాథం! నాకిక్కడేం కొదవ చెప్పు. కాలుమీద కాలేసుకుని కూచున్నాసరే. కావలసిందంతా చక్కా నా దగ్గరికే నడిచొచ్చేస్తుంది....."

"రావచ్చునయ్యా ఒప్పుకుంటాను. కాని బొందితోనే కైలాసానికి వెళ్లడం సాధ్యమా? పల్లెతో వున్న లంకెలన్నీ తెంచుకుని నువ్వు పట్నానికొచ్చి చేరిపోవడమన్నా అంతేగదా! ఇల్లూ వాకిలీ, గొడ్డూగోదా, పొలమూ పుట్రా, అన్నింటికి మించి ప్రోనోట్ల పైన తిరిగే డబ్బు – అవన్నీ ఏం కావాలి?" అంటూ సందేహం వెలిబుచ్చాను.

విరాగిలా ఒక దరహాసం వెలువరించాడు రంగప్ప. "ఆస్తి మాటేముందిలే జగన్నాథం! మా నాయన నాకిచ్చి పోయిందంతా ఒక పూరిగుడిసె మాత్రం. నేను నా హయాంలో కయ్యలు కొనినాను. తోటలు పెంచినాను. మిద్దె కట్టినాను. డబ్బులు గూడా దండిగానే మూటగట్టినాను. కానీ వాటన్నింటికన్నా నాబిడ్డే నాకెక్కువ. ఉన్నదంతా తెగనమ్మేసి, బాకీలు గూడా వసూలు చేసుకుంటే ఎంత లేదన్నా రెండు లక్షలు చేతికొస్తుంది. తీసుకొచ్చి బ్యాంకిలో వేసుకుంటే, ఆ డబ్బు మాత్రం పిల్లలు పెట్టదా? కృష్ణా, రామా అనుకుంటా నేను నా కూతురు పంచలోనే కాలం గడిపేస్తాను. ఏం జగన్నాథం! ఇది మంచి ఆలోచన కాదంటావా?'

తొందరపడి నేను అవుననిగానీ, కాదనిగానీ చెప్పలేదు. కొన్ని ప్రశ్నలకు సమాధానం తేల్చి చెప్పవలసింది కాలమే, మనిషి కాదు. అందుకని, "నీకెలా మంచిదని తోస్తే అలా చేయవయ్యా రంగప్పా! అవతల నాకు చాలా అర్జంటు పనుంది. వెళ్లొస్తాను" అంటూ సెలవు తీసుకున్నాను.

నేనప్పుడు టౌనుకు వెళ్లింది స్పాట్ వాల్యుయేషన్ పనిపైన. పది పన్నెండు రోజులైనా అక్కడ వుండవలసిన సందర్భం. కానీ రంగప్ప ఎక్కడ వెంట తగులుకుంటాడోనన్న జంకుతో నా ఆచూకీ అతడికి తెలియనివ్వకుండా జాగ్రత్త పడ్డాను. కానీ చేయడానికి పనిగానీ, మాట్లాడడానికి మనుషులుగానీ లేని సమయాల్లో నా ఆలోచనలు వుండి వుండి రంగప్ప చుట్టూ ముసురుకుంటూ వచ్చాయి.

బుద్ధి తెలిసినప్పటి నుంచీ నాకు రంగప్పతో పరిచయం కద్దు. అడ్డు దారి గుండా వెళ్తే మద్దిమాకులపల్లె మా వూరికి రెండు మైళ్ళ దూరంలో వుంటుంది. ఆ వూళ్లో మాకు కొంత పొలముండేది (తరువాత్తరువాత ఆ పొలాన్ని గూడా రంగప్పే కొనేశాడనుకోండి! అది వేరే సంగతి). సదరు పొలాన్ని సాగు చెయ్యించడం కోసం, మా నాన్నగారు తరచుగా ఆ పల్లెకు వెళ్తుండేవారు. తోకంటి నారాయణ అన్నట్టుగా అప్పుడప్పుడూ నేను గూడా ఆయన వెంట వెళ్లేవాణ్ణి. ఊరిముందరి రచ్చపైన వినాయకుడెలాగో, మద్దిమాకుల పల్లెలో రంగప్ప అలాగు. వెళ్ళినప్పుడల్లా అతడు మాకు మీట్ కావడం ఖాయం.

వెలుగు మాటెత్తగానే చీకటి, మంచిని గురించి తలుచుకోగానే చెడు జ్ఞప్తికి వచ్చినట్టుగా రంగప్పను గురించి తలుచుకోగానే జ్ఞప్తికి వచ్చేది అతడి పిసినిగొట్టు తనం. అతడు తెల్లగా వుతికిన బట్టలు కట్టుకోగా నేనెప్పుడూ చూడలేదు. ఎంత దూరం వెళ్ళవలసి వచ్చినా తన కాళ్లను తాను నమ్ముకోడమే గానీ, అతడు బస్సుపైన ఆధారపడేవాడు గాదు. పండగనాడైనా అతడు దేవుడికొక కొబ్బరికాయ కొట్టి వుంటాడా అని నా అనుమానం. ఏదైనా వస్తువు కొనడం కోసం అతడు కొట్టులోకి వెళ్లాడంటే, కోమటి శెట్టి కుతకుతలాడి పోయేవాడు. ఓడ సరుకు రేటెంతో అడిగి తెలుసుకుని, ఆ లెక్కన ఒకపలం పంచదార పొట్లం కట్టివ్వమనడం రంగప్ప పద్ధతి.

ఆధునిక విజ్ఞానం వల్ల మానవుడికెన్నో ప్రయోజనాలు చేకూరాయంటే, రంగప్ప సుతరామూ ఒప్పుకోడు. అప్పుడే పుట్టిన పసి నిసుగు స్పష్టంగా మాట్లాడటం ఎంతటి అరిష్టమో, మీట తిప్పగానే ఒక పెట్టి (రేడియో) గొంతు విప్పడమున్నా అంతే అరిష్టమనేవాడు.

ఆకాశంపైన తోకచుక్క పొరాడడం ఎంతటి అనర్థమో, నేలపైన రైళ్ళు బస్సులు పరుగెత్తడమున్నూ అంతే అనర్థమనేవాడు. ఫోటో తీయించుకోడమంటే చావుదగ్గర పడడమేనని అతడి భావన. అంతటితో ఏమయింది? సమాజంలో చోటు చేసుకునే మార్పు అదెంత మంచిదైనా సరే, అతడి పాలిటికి మ్రింగరాని కడిగానే వుండిపోతూ వచ్చింది. ఆడా మగా తేడా లేకుండా, కలిగినోడు అన్న వ్యత్యాసం లేకుండా పిల్లలందరూ ఒక బడిలోకి వెళ్లి చదువుకోడమంటే అది గుర్రాలు గాడిదలు కుక్కలు మొదలైన నానా జాతి జంతువుల్ని ఒక లోగిలిలో కట్టి పడెయ్యడమేనని అతడి సిద్ధాంతం. కులం కట్టును ఉల్లంఘించడమంటే కరెంటు కమ్మిని పట్టుకోడమేనని అతడి నమ్మకం. బీదవాళ్ళు, బిచ్చగాళ్ళు పూర్వజన్మలో పంచ మహాపాతకాలు చేసిన వాళ్లై వుంటారని, వాళ్లకు సాయం చేయడమంటే వాళ్ల పాపాల్ని పంచుకోడమేనని అతడి ఊహ. 'మాటలెందుకులే జగన్నాథం! ఈ లోకమింక బాగుపడేది అనుమానమే' నంటూ ముక్తాయించేవాడు రంగప్ప. 'వొస్తాడొస్తాడు, కొరడా చేతబట్టుకొని, నిలువెత్తు గుర్రమెక్కి వీరభోగ వసంత రాయలొస్తాడు. పెద్దంతరం చిన్నంతరం, పైగనిమ కింది గనిమ, చిన్నాపెద్దా పాటింపు లేకుండా నడుచుకునే వాళ్ళను వాతలెగిరేటట్టుగా కొట్టి, ఎండల్లో బండలపై నిలబెడతాడు.'

భూస్థితి చేజారిపోవడంతో మాకు పల్లెతో అనుబంధం తెగిపోయింది. ఆ తరువాత కొంతకాలానికి మా నాన్నగారున్నూ పోయారు. డిగ్రీ పుచ్చుకుని, 'బి.యిడి' ట్రెయినింగ్ కూడా పొందివచ్చి నేను మావూరి హైస్కూల్లోనే టీచరుగా కుదురుకున్నాను. అయినాసరే, ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట తారసిల్లి రంగప్ప నా బుర్రని వేడెక్కించడం మట్టుకూ మానలేదు.

ఒకనాటి మధ్యాహ్నం పన్నెండు గంటలవేళ, అప్పుడు నాకు క్లాసు లేకపోవడం వల్ల చల్లనిగాలి కోసం బడికట్టడాలకు వెనుక వైపున వున్న చింతచెట్ల క్రిందికి వెళ్లాను. అక్కడొక చెట్టు బోదెకు చేరగిలబడినట్టుగా కూచుని, అర్థనిమీలిత నేత్రుడైవున్న రంగప్ప కనిపించాడు. మూడు గిన్నెల మీల్స్ కారియర్ ఒకటి, దాని ప్రక్కన్నే చిన్న వాటర్ బాటిల్ ఒకటి తల్లి బిడ్డల్లా ఒకచెట్టు కొమ్మకు వ్రేలాడుతున్నాయి.

"ఏమిటి రంగప్పా! ఇక్కడేం చేస్తున్నావు?" విస్తుపోతూ ప్రశ్నించాను.

"ఆరోజు నువ్వు బడిలో లేదులే జగన్నాథం! మా అమ్మి శివగంగనిక్కడ్నే ఆరులో చేర్పించినాను" అన్నాడు రంగప్ప.

"చేర్పిస్తే మట్టుకు? ఆ పిల్ల కోసమని నువ్వీ వేళప్పుడు అన్నం తీసుకొస్తావా? చాలని దానికి నీళ్లు గూడానా? ఏంబాబూ! నీ కూతురు మావూరి నీళ్లయినా ముట్టుకోగూడదా?"

"కాదులేవయ్యా! చెప్పేదాకా నిదానించవే! తెల్లారెప్పుడో వండిపెడ్తే ఆ అన్నం మధ్యాహ్నానికి చల్లారిపోదా? ప్రతి దినము చల్లారిన తిండి తింటే బిడ్డ ఒళ్ళేం కావాలని?ఇంక మంచి నీళ్లంటావా? మా అమ్మికి మొదట్నుంచీ మా యింటి చేదబావి నీళ్లే వాడుక. మారిస్తే జలుబు చేస్తుంది..."

నాకు ఒళ్ళు మండింది. "అబ్బబ్బ, నీ కూతురికి జలుబు చేయడమా! ఎంత మాటెంతమాట! బ్రహ్మాండం బద్దలైపోదూ! సరే, అదలా వుంచు, ఆడదానికి చదువెందుకనే వాడివి గదా! ఇప్పుడా మాట ఏమయింది? నీకూతురు మాత్రం ఆడదిగాకపోయిందా?" నిలదీసి అడిగాను.

నా అజ్ఞానానికి జాలిపడ్డట్టుగా నవ్వేశాడు రంగప్ప. "అదిగాదయ్యా జగన్నాథం! గుళ్ళో వుండే దేవుడూ రాయే! కాళ్లకింద పడే బండరాయీ రాయే! రెండూ ఒకటేనంటావా? నా కూతురికేమయ్యా, పెట్టి పుట్టింది! జొన్న కంకి మీద పిచ్చుక గువ్వ. ప్రపెంచకంలో ఎన్ని చదువులుండాయో, అన్నీ దానికొచ్చేయ్యాల! అది డాక్టేరు గావాల. కలకటేరు గావాల. దాన్నెప్పుడూ ఆడదనుకోబాకు! అది రాణి. మహరాణి!"

రంగప్పను గురించి నేనెన్ని ఆరోపణలైనా చెయ్యగలను. కానీ తన కూతుర్ని పెంచడంలో అతడు కనపరిచిన చిత్తశుద్ధిని మాత్రం శంకించలేను. అయిదు వందలమంది పిల్లలున్న హైస్కూల్లో నేను రంగప్ప కూతురు కోసం వెదుక్కోవలసిన అవసరం లేకపోయింది. రోజుకొక రకం దుస్తులు ధరిస్తూ తొడుక్కున్న దుస్తుల రంగునుబట్టి గులాబీలా, చేమంతిలా, కనకాంబరంలా, డిశంబరంలా కానవచ్చేది శివగంగ. బడికంతా రిస్టు వాచీ కట్టుకునే స్టూడెంటు ఆ అమ్మాయి ఒక్కతేనని చెప్పొచ్చు. డాలరుతో బాటుగా మెడలో ఒక చిన్న బంగారు గొలుసు. అసలే అందమైన పిల్ల. ఈ ముస్తాబువల్ల చుక్కల్లో చందమామలా కనిపించడంలో అబ్బురమేముంది? ఆహార్యంలో మట్టుకే గాదు. చదువుల్లో గూడా తన కూతురు ముందువరుసలో వుండాలని రంగప్ప ఆశించాడు. యాభై రూపాయల నెలసరి జీతం యేర్పాటు చేసి అతడొక రిటైర్డు టీచరు చేత తన కుమార్తెకు ప్రయివేటు చెప్పిస్తున్నాడని విన్నాను.

'ఒక్కగానొక్క కూతురు. పైగా తల్లిలేని బిడ్డ. గారాబంగా పెంచుకోడా మరి!' అని పదిమంది చెప్పుకోవడం నా చెవిని బడుతూ వచ్చింది.

తొమ్మిదో తరగతిలో వుండగా శివగంగకు రంగప్ప సైకిలు కొనిపెట్టాడు. గ్రామీణ సమాజంలో ఒక ఆడపిల్ల సైకిలు తొక్కడం విడ్డూరమే! కానీ రంగప్ప కూతురు గదా! అతడేం సామాన్యుడు గాదు. రెండు లక్షల రూపాయల స్థితిమంతుడు. బొత్తిగా అవుటాఫ్ డేట్ అయిపోయింది గానీ, లేకపోతే తన కూతురికొక పంచకల్యాణి గుర్రాన్నే కొనిపెట్టగలిగి వుండేవాడు. గుర్రంపైన చిన్న రుద్రమదేవిలా ద్యోతకం కావలసిన శివగంగ, చిన్న ఆంగ్లో యిండియన్ దొరసానిలా సైకిలు పైన బడికొస్తూ వుంది.

ఎస్సెల్సీ పరీక్షలో మంచి మార్కులతోటి పాసయింది శివగంగ. రంగప్ప ఆమెను తిరుపతికి తీసుకెళ్లి పద్మావతీ మహిళా కళాశాలలో చేర్పించాడని తెలిసింది.

శివగంగ హైస్కూలు గడప దాటిపోయింది. గనుక, యిక రంగప్పకు నాతో అట్టే పని ఉండదని నేననుకున్నాను. నా ఊహ పొరపాటు. అప్పటినుంచీ నాకు రంగప్ప యిబ్బుడి ముబ్బుడిగా పని కల్పించాడు. ఉత్తరాలకు ప్రత్యుత్తరాలు రాయడం, మనియార్డరు ఫారాలు నింపడం, ప్రోగ్రెసు కార్డులు వివరించడం మొదలైన వాటితోబాటు మన దేశంలోని ఉన్నత విద్యా స్వరూపాన్ని గురించి నేనప్పుడప్పుడూ అతడికి ప్రయివేటు చెప్పడం గూడా తప్పనిసరైపోయింది.

ఇంటర్మీడియట్ అనేది రెండేళ్లు చదవాలి. ఇందులో రెండు భాషలతోబాటు 'గ్రూపు' అని ఒకటుంటుంది. అందులో తీసుకునే సబ్జక్టులను బట్టి సాధారణంగా విద్యార్థి పై చదువులేమిటో నిర్ణయమవుతాయి. ఇంటరు ముగిశాక కొందరు మెడికల్ కాలేజీలో చేరి డాక్టర్లవుతారు. కొందరు ఇంజనీర్లవుతారు. మిగిలిన వాళ్లు బి.ఎ., బి.యస్సీ., బి.కాం. లాంటి కోర్సులలో చేరతారు. చివరి మూడూ మూడేళ్ళ కోర్సులు. అవి పూర్తయ్యాక రెండేళ్ళ పి.జి కోర్సులున్నాయి. ఆపైన యం.ఫిల్.కు గానీ, పిహెచ్.డి.కి గానీ....

"ఈ లెక్కన చచ్చేదాకా చదవతా వుండిపోవచ్చునే!" విస్మయం ప్రకటించాడు రంగప్ప.

"నిజమే మరి! కలిగిన మారాజులు ఎంతకాలమైనా తమ పిల్లల్ని చదివించుకోగలరు. ఎటొచ్చీ జరుగుబాటు లేనివాళ్లకే యిబ్బంది, వాళ్లు తొందర తొందరగా చదువు ముగించి బ్రతుకుదెరువు కోసం ఏ వృత్తిలోనో, ఉద్యోగంలోనో ప్రవేశించవలసి ఉంటుంది...."

రంగప్ప తన కుమార్తెను చదివించడంలో చాలా ఓరిమి ప్రదర్శించేడనే చెప్పాలి. "పద్మావతి" లో అయిదేళ్ళున్నాక ఆమె పై చదువులకోసం యూనివర్సిటీ కాలేజీలో చేరింది. నెలకు నాలుగైదు వందల చొప్పున తన సంవత్సరాదాయంలో సగపాలు రంగప్ప కూతురు చదువు క్రిందే వెచ్చిస్తూ వచ్చాడు. మద్దిమాకుల పల్లె నుంచీ ఒక ఒంటెద్దు బండి వచ్చి మా వూరి బస్‌స్టాండులో ఆగివున్నట్టయితే, ఆరోజున రంగప్ప కూతురు శివగంగ తిరుపతి నుంచి రాబోతున్నదని మేమందరమూ అనుకునేవాళ్లం. చలవద్దాలు సరిచేసుకుంటూ, వానిటీ బ్యాగును వూపుకుంటూ, పల్లకిలోనుంచి దిగే రాకుమారిలా ఎత్తు మడమల జోళ్లలో నుంచీ, సుతారంగా బస్సు దిగేది శివగంగ. పెట్టె, పరుపు, సంచులు మొదలైన వాటిని రంగప్ప పదిలంగా క్రిందికి దించుకునేవాడు. వంకర టింకర దారిపైన ఒంటెద్దు బండి సాగిపోతూ వుంటే పొలాల్లో పనిచేసుకుంటూ వుండే కూలీనాలీ బక్క జనమంతా 'అదో, రంగప్ప కూతురొచ్చేసింది' అని అంటూ బాట పైకి పరుగెత్తు కొచ్చేసేవాళ్ళు.

సరే! రంగప్ప కూతురు చదువుకుంటూ వుందనీ, యింకా చదువుకోవాల్సింది వుందనీ కాలం ఆగుతుందా? ఆగదు, చూస్తూ చూస్తూ వుండగానే ఆమెకు పాతికేళ్లొచ్చాయి. ఆకాశమంత పందిరివేసి, భూదేవంత అరుగు నిర్మించి కూతురికి జాంజామ్మని పెండ్లి చేసేయ్యాలన్న కోరిక ఏనాటినుంచో రంగప్ప మనసులో చిందులేస్తూ వుంది. ఇలా వుండగా పిట్ట పిడుగులాంటి వార్త ఒకటి మా గ్రామీణ ప్రాంతంలోకి మొదట గాలి కబురుగా ప్రాకి వచ్చి, తరవాత పచ్చి నిజంగా ప్రచారమై పోయింది.

భయపడకండి! మరేం అమంగళంకాదు. తండ్రి ఎప్పుడో చేస్తాడని వేచి కూచోకుండా, శివగంగ వివాహ నిర్ణయాన్ని తన చేతుల్లోకి తీసుకుంది. ఇంతకూ అది 'బేడ్ చాయిస్' అని చెప్పడానికి గూడా వీల్లేదు. రిసెర్చిలో గైడ్‌గా వుండిన ప్రొఫెసరే నిజజీవితంలో భాగస్వామి గావడం ఎంతటి వాళ్లకు దొరికే భాగ్యం! ఆయనకెప్పుడో పెళ్లయింది. పెళ్లయిన కొద్ది కాలానికే భార్య పోయింది. దాదాపు పదేళ్ల నుంచీ విధురుడుగా ఏకాంత జీవితం గడుపుతున్నాడు. బ్రహ్మర్షి పదవికి బారెడు దూరంలో వున్న విశ్వామిత్రుడికే మనసు చలించగా, యింక ప్రొఫెసరు గారి మాటకేముంది? ఇంతకూ తన పబ్బం గడుపుకోడానికి అతడామెను వంచించి వుంటే అది వేరే సంగతి. అదేం లేదు. పాపం! చట్టబద్ధంగా రిజిస్ట్రారు ఆఫీసులో పెళ్లి చేసుకున్నాడు. ఆ తతంగం పూర్తి కాగానే మిత్రులు కొందర్ని పిలిచి విందు కూడా ఏర్పాటు చేశాడు. అంతటితో మద్దిమాకుల పల్లె నడిమింటి రంగప్ప కూతురు శివగంగ, కొబ్బరికాయలోకి నీళ్లెక్కినంత సహజంగా తిరుపతి నాగరిక సమాజంలో మిసెస్ శివగంగా దక్షిణామూర్తిగా మారిపోయింది.

తండ్రి దృక్పథంలో నుంచి నేనీ సంఘటన గురించి పరి పరి విధాలుగా ఆలోచించాను. ఈ దెబ్బ నుంచీ బహుశా యిక రంగప్ప కోలుకోవడం సాధ్యం కాదనిపించింది. హఠాత్తుగా అతడెక్కడ తారసిల్లి పోతాడోనని భయడ్డాను గూడా! ఎదురైతే అతడు భోరున ఏడ్చేస్తాడు. అతణ్ణి నేనెలా సముదాయించగలను?

ఒకనాటి సాయంకాలం నేను ఊరి బయటకు వెళ్లి తిరిగిస్తుండగా సేద్యగాడి చేత తిరసనాయిలు డబ్బా మోయించుకెళ్తున్న రంగప్ప నాకు చెరువు కట్టపైన ఎదురయ్యాడు. సేద్యగాణ్ణి సాగిపొమ్మని చెప్పి, నన్ను తూము రాయిపైన కూచోబెట్టేశాడు. ఆశ్చర్యమేమిటంటే బాగడా వేసి వెదికినా అతడి ముఖంలో దిగులు గానీ, దైన్యం గానీ కానరావడం లేదు. పైగా ఆకాశానికి మూడే బారలన్నంత ఉత్సాహంగా ఉన్నాడు.

"ఏమయ్యా జగన్నాథం! ఒక మూతి ముడుచుకోడమేనా? ఒక నొసలు చిట్లించడమేనా? ఒక చెవులు కొరుక్కోడమేనా? వీళ్ళకేం పొయ్యే కాలం వచ్చిందో నీకేమైనా తెలుసునా?"

వీళ్ళకు అంటే ఎవళ్ళకు? అయోమయంగా అతడి వైపు చూచాను.

"వీళ్లంటే లోకులేనయ్యా! నా కూతురేం తప్పు చేసిందని వీళ్ల ఉద్దేశం? అహఁ, నాకు తెలియకనేనయ్యా నిన్నడగడం! నువ్వు చెప్పు, నా కూతురు చేసింది తప్పేనంటావా?"

తాను ముద్దాయిగా పరిగణించిన లోకులందరికీ నన్ను ప్రతినిధిగా ఎన్నిక చేసి, రంగయ్య తన కుమార్తె తరఫున వకాల్తా పుచ్చుకొనేసరికి నేను తికమక పడిపోయాను.

"లోకుల మాటకేంలే రంగప్పా! వాళ్లు కాకులు గదా! వాళ్ల సంగతి నీకొద్దు. నీ కూతురు చేసిన పని నీకు నచ్చితే చాలు" అన్నాను.

" ఆ మాటన్నావు కాబట్టి బాగుంది. కాకపోతే కులాంతరమంటారేమో! నేనొకడుగుతా. ఏం కులమయ్యా బోడికులం! చొక్కమయిన కులం ఎవడికేడ్చింది? వరుసగా పదితరాలు కణిషించి చూస్తే ఎక్కడో ఒకొక్కడ కథ బెడిసిపోయే వుంటుంది. ఆహఁ, అది కాదులే! అసలుకంటు వేరే వుంది. బాగా చదువుకున్నోడు. భారీ ఉద్యోగస్తుడు. దండిగా సంపాదించేవాడు. అటువంటివాడు రంగప్ప కల్లుడై పోయినాడు గదా అని మనసొప్పని తనం. నాకేం తెలియదా?"

అవసరాన్ని బట్టి రాజ్యాంగ చట్టాన్ని సవరించుకుంటూ వెళ్లినట్లుగా, కూతురికోసం తన అభిప్రాయాలను, ఆచారాలను మార్చుకుంటూ వస్తున్నాడు రంగప్ప. పరమ లోభిగా పేరు తెచ్చుకున్నవాడు, కుమార్తె కోసం రూపాయను గుడ్డి గవ్వలా ఖర్చు పెట్టాడు. ఆడదానికి చదువెందుకనే చాదస్తుడు తన కూతురు చదువుల్లో ఎల్లల్ని స్పృశించాలని ఆశించాడు. ఆఖరుకు తన బిడ్డ దగ్గరికి వచ్చేసరికి కరెంటు కమ్మిలాంటి 'కుల కట్టు' సైతం అతడి పాలిటికి వట్టి చొప్పదంటై పోయింది. ఇటీవల రోడ్డుపైన తారసిల్లినప్పుడు 'అన్నింటికన్నా నా కూతురే నాకెక్కువ' అన్నాడు రంగప్ప. ఆ ఎక్కువైన దాని కోసం అతడు దేన్ని వదులుకోడానికైనా సిద్ధంగానే వున్నట్టున్నాడు.

*　　*　　*

పేపర్లు దిద్దే పని పది రోజుల పర్యంతం కొనసాగింది. ఆ డ్యూటీ నుంచి విడుదలైన నాటి రాత్రి రెండో సినిమాకు వెళ్ళి తెల్లవారు జామున బయల్దేరే బస్సును అందుకోడం కోసం బస్‌స్టేషనుకు చేరుకున్నాను. మామూలు మేరకు తిరుపతి బస్‌స్టేషను రద్దీగానే వుంది. కూర్చోడానికెక్కడైనా తావు దొరుకుతుందేమోనని బెంచీల వైపు చూస్తుండగా, మోకాళ్ల మధ్య తల దాచుకుని వానలో తడిసిన పిట్టలా ఒదిగి కూర్చున్న వ్యక్తి ఒకతను ఒక బెంచీపైన కనిపించాడు. ముసుగులో నుంచీ తల పైకెత్తే దాకా అతడెవరో నాకు తెలిసింది కాదు. తెలిశాక దగ్గరగా వెళ్ళి భుజంపైన చెయ్యివేసి "ఏమిటి రంగప్పా! ఈ వేళప్పుడు యిక్కడెందుకున్నావు? ఊరికొస్తున్నావా ఏమిటి?" అని అడిగాను.

రంగప్ప మాట్లాడలేదు. మాటల యొక్క నిరుపయోగత్వాన్ని గుర్తెరిగిన విరాగిలా మౌనంగా కూర్చున్నాడు.

"పోనీ, ఊరికి వెళ్ళాలని అనుకున్నా వనుకో! పగటిపూట బయల్దేరగూడదా? ఈ రాత్రి వేళ రెడ్ బిల్డింగ్స్ నుంచీ యింత దూరం నడిచొచ్చి...."

"కాదులేవయ్యా!" విసుక్కుంటున్నట్లుగా అన్నాడు రంగప్ప. "నేను రాత్రి పది గంటలప్పుడెప్పుడో యిక్కడికొచ్చేసినాను...."

"ఎందుకూ? అప్పుడు బస్సులుండవే!"

"ఉండేటప్పుడుంటాయి. వెళ్లేటప్పుడు వెళ్తాను."

అంతేగాని, ఇక్కడ మాత్రం వుండనే వుండను అని అతడు చెప్పలేదు. కానీ ఆభావం అతడి మాటల్లో ధ్వనించింది.

రంగప్ప ఈ నిర్ణయానికి రావడానికి వెనుక కారణాలేవో వుండే వుండాలి. అడిగే చొరవా నాకున్నప్పటికీ, ఆ పనిచేయడానికి నాకెందుకో మనస్కరించడం లేదు. ఉండి వుండీ రంగప్పే ప్రేలిపోయాడు.

"ఏమయ్యా జగన్నాథం! నేనంటే పల్లెటూరి గొర్రెని. నువ్వు నాలాంటోడివేమీ గాదు. కొద్దో గొప్పో చదువుకున్నోడివి. పదూళ్లు తిరిగినోడివి. పది సంగతులు తెలిసినోడివి. నాకేదైనా తెలియకపోతే నిన్నడగాల, నువ్వు జవాబు చెప్పాల. ఏమంటావు?"

ఏమంటాను? ఈ ముంగాళ్ల బంధం దేనికి దారితీస్తుందో తెలియకపోయినా గంగిరెద్దులా 'సరే'నని తలాడించాను.

"నిద్ర లేవగానే ముఖమైనా కడుక్కోకుండా కాఫీ త్రాగొచ్చునా?"

"త్రాగ్గూడదు."

"రోడ్డుపైన తిరిగినట్లు ఇల్లంతా చెప్పులేసుకుని తిరగొచ్చునా?"

"తిరగకూడదు"

"ఆరిపోయే దానికి, కాల్చేదానికీ ఎడం లేకుండా అదేపనిగా సిగరెట్టు కాల్చొచ్చునా?"

"కాల్చకూడదు"

"ఇంటికొచ్చే వాళ్లనంతా పొగేసుకొని నడి రేతిరి దాకా కప్పెగిరి పోయేటట్టు అరవొచ్చునా?"

"అరవగూడదు."

"సరే! నువ్వూ నేనూ, అట్లా అనుకోడం వల్ల ఏం లాభం?"

"పోనీ, 'ఇది పద్ధతి కాదు బాబూ! మార్చుకోవాలి' అని నువ్వే అల్లుడిగారితో చెప్పలేకపోయావా రంగప్పా?"

" ఆ మనిషితో నాకేం మాటలు? చెప్పాల్సిన నాలుగు మాటలూ నేను మా అమ్మితోనే చెప్పేసినాను."

"ఏమంది?"

"ఏమంటుంది?" రంగప్ప కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. డగ్గుత్తికలో నుంచీ మాటలు చాలా అస్పష్టంగా వినిపించాయి.

"నీకీ బాదరబందీ అంతా ఎందుకు నాన్నా? పట్నంవాసంలో యిమడలేవు. మన వూరు వెళ్లిపో. అక్కడేవుండు అనేసింది."

ఇది నిజంగా గట్టి దెబ్బే! ఎదరు చూడని చోటు నుంచి వచ్చి, తగలరాని చోట తగిలింది.

నేను రంగప్పను చివరిసారిగ చూడడం ఆ బస్సు ప్రయాణంలోనే. తిరుపతి నుంచీ తిరిగివచ్చాక అతడు జబ్బుపడ్డాడని విన్నాను. రెండు నెలల తర్వాత ఆ దుర్వార్త గూడా వినవలసి వచ్చింది. అయితే ఒకటి. పోతూ పోతూ అతడొక చరిత్రను సృష్టించి పోగలడని మాత్రం ఎవ్వరూ అనుకోలేదు. స్వార్జితమైన ఆస్తిపాస్తులన్నింటిని మా వూరి హైస్కూల కు చెందేటట్టుగా నిర్ణయించి, ఆ డబ్బుతో కట్టే కట్టడానికి తన పేరు పెట్టవలసిందిగా అతడు వీలునామా రాయించి పోయాడు.

రంగప్ప జీవిత కథ మూలంగా నేనొక గొప్ప రహస్యం గ్రహించాను. అన్నింటికన్నా మానవుడికి ఎక్కువైన దేమిటో నాకు స్పష్టంగా తెలిసి పోయింది.

● ఆంధ్రసచిత్ర వార పత్రిక 1986 ●